

అప్పుల బాధ తట్టుకోలేకే.....!



- పుష్ప దుకాణ యజమాని ఇంట్లో దోపిడీ యత్నం
- ఏడుగురు నిందితుల్లో ఆరుగురికి రిమాండు
- సాహసించి నలుగురు నిందితులను పట్టుకున్న స్థానికులకు ఎస్పీ మణికంఠ ప్రశంస



మీడియా సమావేశంలో దోపిడీ ఘటన వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ మణికంఠ - నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు

చిత్తూరు అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరులో పట్టపగలు డమ్మీ తుపాకులతో దోపిడీకి ప్రయత్నించిన ఏడుగురిని అరెస్టు చేసిన పోలీసులు వారిలో ఆరుగురిని గురువారం రిమాండుకు తరలించారు. వారి వద్ద దొరికిన మూడు తుపాకులను, కత్తులను, నాలుగు బుల్లెట్లను, నాలుగు పిల్లెట్స్‌ను సీజ్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఏఎస్పీలు నంద కిశోర్, రాజశేఖరరాజు, మహబూబ్‌బాషలతో కలిసి ఎస్పీ మణికంఠ మీడియాకు వివరించారు.నంద్యాలకు చెందిన సుబ్రహ్మణ్యం(52) వ్యాపారాల్లో నష్టపోయి ఐపీ పెట్టి చిత్తూరుకు వలస వచ్చాడు.జీకే నగర్‌లో వుంటూ ఇక్కడా వ్యాపారాలు చేసి అప్పులపాలయ్యాడు. రుణబాధల నుంచి బయటపడడానికి మరో ఆరుగురితో కలసి చిత్తూరు గాంధీరోడ్డులో వున్న పుష్ప కిడ్స్ వరల్డ్ షాపు యజమాని చంద్రశేఖర్ ఇంట్లో దోపిడీకి ప్లాన్ చేశాడు.ఈ పనికి ఉపయోగపడతారనుకున్న మిత్రులను చిత్తూరుకు పిలిపించాడు. బుధవారం ఉదయం 6.40గంటలకు ఓమ్నీ వ్యాన్‌లో నంద్యాలలోని బర్మశాలకు చెందిన నవీన్ కుమార్(39),దొమ్మలసత్రానికి చెందిన సంపత్‌కుమార్(40), కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఇబ్రహీం(32),అనంతపురం జిల్లా బారుట్ల రామాపురానికి చెందిన రామాంజనేయులు(26), రాజశేఖర్(21), నెట్టి కంఠయ్య(18)లతో కలసి నగరంలోని గాంధీ రోడ్డులోని పుష్ప కిడ్స్ దుకాణానికి చేరుకున్నారు.అదే సమయంలో షాపు యజమాని చంద్రశేఖర్ భార్య శాంతి షాపును శుభ్రం చేయడానికి షట్టర్ తీశారు. ప్రధాన నిందితుడు సుబ్రహ్మణ్యం దుండగులతో కలిసి రెండవ అంతస్తులోకి ప్రవేశించి ఆమెను తుపాకులు, కత్తులు చూపించి బెదిరించారు. ఇంటిలోని నగలు, డబ్బులు ఇవ్వాలన్నారు. గమనించిన చంద్రశేఖర్ వారిని ప్రతిఘటించగా దుండగులు అతనిపై దాడి చేశారు. ఈ దాడిలో చంద్రశేఖర్ తలకు, కుడిచేతికి గాయాలయ్యాయి. బాధితులు సహాయం కోసం కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులను చూసిన దుండగులు తప్పించుకోవడానికి పక్క భవనంపైకి దూకడంతో సుబ్రహ్మణ్యానికి గాయాలయాయి.స్థానికుల సహాయంతో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు మిగిలిన నిందితులకోసం భవనమంతా తనిఖీ చేశారు.ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. పారిపోయిన రాజశేఖర్, సంపత్, నెట్టికంఠయ్యలను గురువారం మధ్యాహ్నం కాణిపాకం క్రాస్ వద్ద చిత్తూరు రెండవ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన ఏడుగురు నిందితులలో ఆరుగురిని రిమాండ్‌కు తరలించారు. ప్రధాన నిందితుడు సుబ్రహ్మణ్యం గాయపడి వుండడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.డాక్టర్ల సూచన మేరకు త్వరలో అతన్నీ రిమాండ్‌కు తరలిస్తామని ఎస్పీ తెలిపారు. అతడిపై నంద్యాల పోలీసు స్టేషన్‌లో ఆరు కేసులున్నాయని, వీటిలో ఒక కేసుకు సంబంధించి పదేళ్ల జైలు శిక్షను కూడా అనుభవించాడన్నారు. కొన్నేళ్ల క్రితం చిత్తూరుకు వచ్చిన సుబ్రహ్మణ్యం ఎస్ఎల్‌వీ ఫర్నిచర్ పేరుతో దుకాణాన్ని నడుపుతున్నాడన్నారు.అలాగే సంపత్‌కుమార్‌పై నంద్యాల ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఒక కేసు నమోదయ్యిందన్నారు.దొంగలను పట్టుకోవడంలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన ప్రజలను ఎస్పీ ప్రశంసించారు. అలాగే ఈ సంఘటనకు సంబంధించి సీఎం చంద్రబాబు జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అభినందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కేసును ఛేదించిన పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎస్పీ రివార్డులను అందించారు.డీఎస్పీ సాయినాథ్, సీఐలు నెట్టికంఠయ్య, జయరామయ్య, బాస్కర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్పీ నందకిశోర్‌కు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ఎస్పీ

అవసరానికి మించి హడావిడి!

- చర్చనీయాంశమైన పోలీసుల పనితీరు

చిత్తూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా దొంగలు రాత్రివేళ దోపిడీలకు ప్లాన్ చేసుకుంటారు. కానీ జిల్లా కేంద్రమైన చిత్తూరులో బుధవారం ఉదయం 6.30 గంటలకు ఏకంగా ఏడుగురు డమ్మీ తుపాకులతో దోపిడీకి ప్రయత్నించడం ఆశ్చర్యంగొలుపుతోంది. స్థానికులే నలుగురు దొంగల్ని పట్టుకుని దేహశుద్ధి చేసి అప్పగించగా.. మిగిలిన ముగ్గుర్ని అయినా ఎందుకు ఘటనా స్థలం వద్దే పోలీసులు పట్టుకోలేకపోయారన్న ప్రశ్న ఉత్పన్నమవు తోంది.అసలు బాధితుడు చంద్రశేఖర్ దోపిడీ ఘటనపై ఫిర్యాదు చేయకుండా, షాపులో పనిచేసే సిబ్బందితో ఫిర్యాదు ఎందుకు చేయించారన్నది నగరంలో చర్చగా మారింది.

డమ్మీ తుపాకులని నిర్ధారించడంలో ఆలస్యం

పోలీసు అధికారులు తుపాకిని చూసిన వెంటనే లేదా చేత్తో పట్టుకున్న వెంటనే పరిశీలించి నిర్ధారిస్తారు. కానీ, బుధవారం నాటి ఘటనలో నిందితులు వాడిన తుపాకులు డమ్మీవని వెంటనే నిర్ధారించలేకపోయారు. వాస్తవానికి ఏఆర్ విభాగంలో ఆయుధాల కోసం ప్రత్యేకంగా పనిచేసే 'ఆర్మర్' అనే ఉద్యోగి ఉంటారు. అతన్ని ఘటనా స్థలానికి పిలిపించినా వెంటనే నిర్ధారించి ఉండేవారు.సాయంత్రం వరకూ అవి నకిలీవని నిర్ధారించలేకపోవడం చర్చనీయాంశంగా మారింది.



దొంగలు వాడిన తుపాకి

- మిగిలిన ముగ్గుర్నీ పట్టుకోలేక..



దొంగలను బంధిస్తున్న స్థానికులు

ఘటన జరిగిన వెంటనే స్థానికులు సుమారు 50-60 మంది గుమికూడి, బిల్డింగును చుట్టుముట్టి దొంగల్ని పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి పోలీసులు వచ్చాక అప్పగించారు. అప్పటికే మిగిలిన ముగ్గురు పారిపోయారు. అదుపులో ఉన్న నలుగురు కూడా పెద్దస్థాయి క్రిమినల్స్ కాదని విచారణలో తెలిసిపోయింది.వారంతా తమ సెల్‌ఫోన్లు ఆన్‌లో ఉంచుకుని దొంగతనానికి వెంట తీసుకెళ్లారు.అయినా.. మిగిలిన ముగ్గురూ లోపలే ఉన్నారని భావించిన పోలీసులు ఏకంగా 200 మంది ఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. అయినా మిగిలిన ముగ్గుర్ని వెంటనే పట్టుకోలేకపోయారు. అదుపులో ఉన్న నలుగురు మిగిలిన ముగ్గురి పేర్లను, ఫోన్‌నెంబర్లను చెబితే వారి సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా ఒకర్ని బుధవారం సాయంత్రం ములకలచెరువులో, మరో ఇద్దర్ని గురువారం తెల్లవారుజామున నంద్యాలలో అదుపులోకి తీసుకున్నారు.

ఆక్టోపస్ అవసరమెంత?

బస్సులు, రైళ్లు హైజాక్ అయినప్పుడు, వీవీఐపీలను కిడ్నాప్ చేసినప్పుడు, తప్పించుకున్న నిందితుల్లో తీవ్రవాదులున్నప్పుడు, అటాక్ జరుగుతుందని భావిస్తున్నప్పుడు పిలిపించే ఆక్టోపస్ బలగాలను బుధవారం చిత్తూరుకు రప్పించడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. బుధవారం ఉదయం 7- 8 గంటల మధ్య మొత్తం వ్యవహారం ముగిసిపోయి నలుగురు పట్టుబడగా.. ముగ్గురు పారిపోయారని క్లారిటీ వచ్చేసింది. అయినా, 9.30 గంటలకు ఆక్టోపస్ బలగాలను పిలిపించారు.

- నిందితుల వాహనాన్ని గుర్తించలేక



దొంగలొచ్చిన ఓమ్నీ వాహనం

నిందితులు ఏడుగురు ఓమ్నీ వ్యానులో ఘటనా స్థలానికి వచ్చారు. లోపలికి వెళ్లడం, అట్నుంచి అటే కొందరు దొరికిపోవడం, మరికొందరు పారిపోవడం చకచకా జరిగిపోయింది. కానీ, వాళ్ల వచ్చిన వాహనం బయటే ఉన్నా.. పోలీసులు దాన్ని గుర్తించలేకపోయారు. చాలాసేపటి తర్వాత అక్కడే ఉన్న ఓ జర్నలిస్టు ఈ విషయాన్ని గుర్తించి పోలీసులకు చెప్పడంతో వాళ్లు దాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

- ఫిర్యాదుకు బాధితుడి వెనకడుగు

పుష్ప కిడ్స్ వరల్డ్ యజమాని చంద్రశేఖర్ తన ఇంట్లో దోపిడీ ఘటన మీద పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనకడుగు వేసినట్లు చెప్పుకుంటున్నారు. అవసరానికి మించి పోలీసులు హంగామా చేయడంతో తన ఇమేజ్, గుడ్‌విల్ దెబ్బతిందని స్నేహితుల వద్ద చెప్పుకున్నాడని చెబుతున్నారు.చివరకు పోలీసులు బెదిరించడంతో ఆలస్యంగా షాపులో పనిచేసే సిబ్బందితో ఫిర్యాదు చేయించారు. ఘటన జరిగినప్పుడు ప్రత్యక్షంగా లేని వ్యక్తి నుంచి పోలీసులు ఫిర్యాదు తీసుకోవాల్సి వచ్చింది. వాస్తవానికి ఘటనలో మూడు కుట్లు పడిన చంద్రశేఖర్ నుంచి ఫిర్యాదుతో పాటు ఎమ్మెల్సీ (మెడికో లీగల్ కేసు) వివరాలు తీసుకోవాల్సి ఉంది.



పుత్తూరు సమీపంలోని నారాయణవనంలో వున్న సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన జుబులేషన్ వేడుకల్లో చిరునవ్వులు చిందిస్తున్న సినీ హీరోయిన్ సంయుక్త మీనన్

నేడు శాంతిపురానికి నారా భువనేశ్వరి

రామకుప్పం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శుక్రవారం శాంతిపురంలో పర్యటించనున్నట్టు టీడీపీ శ్రేణులు తెలిపాయి. ఉదయం 9గంటలకు హైదరాబాదు నుంచి బెంగళూరు ఎయిర్‌పోర్టుకు చేరుకునే ఆమె అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా మధ్యాహ్నం 12.30 గంటలకు శాంతిపురం మండలం రాళ్ళబూదుగూరుకు చేరుకుంటారు. కోదండరామస్వామి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కదిరిముత్తనపల్లెకు చేరుకుని సిద్ధేశ్వర స్వామి పెద్దదేవరలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3గంటలకు ఆమె తిరుగు పయనపవుతారు.

నేడే సిద్ధేశ్వరస్వామి పెద్ద దేవర



కుప్పం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కురబల కులదైవం సిద్ధేశ్వరస్వామి పెద్ద దేవర వేడుకలకు శాంతిపురం మండలం కదిరిముత్తనపల్లె సిద్ధమైంది. 9 ఏళ్ల తర్వాత జరుగుతున్న సిద్ధేశ్వరస్వామి ఉత్సవాలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త మునిరత్నం గౌడ్, నిర్వాహకుడు చంద్రశేఖర్ చెప్పారు.భక్తులు తమ తలలపై టెంకాయలు పగులగొట్టుకుని స్వామివారికి మొక్కులు తీర్చుకోవడం ఈ ఉత్సవంలో ప్రధాన ఘట్టం.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శుక్రవారం) : 6.28
సహరి (శనివారం) : 5.02

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 916 మంది గైర్హాజరు

చిత్తూరు సెంట్రల్,మార్చి13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 916 మంది గైర్హాజరైనట్లు డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు. గురువారం నిర్వహించిన ఫస్టియర్ కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ పేపర్-1 పరీక్షలకు 15,947 మందికి 15,030 మంది హాజరవగా, 916 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. జనరల్ ఇంటర్‌లో 14,607 మందికి 13,876 మంది హాజరవగా, 730 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షల్లో 1340 మందికి 1154 మంది హాజరవగా, 186 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీవీఈవో వివరించారు.

దీపం-2 కింద మొదటి సిలిండర్‌ను ఈ నెలాఖరులోగా తీసుకోండి: డీఎస్వో

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): దీపం-2 పథకం కింద అర్హులైనవారు మొదటి వంటగ్యాస్ సిలిండర్‌ను ఈ నెలాఖరులోగా తీసుకోవాలని డీఎస్వో శంకరన్ సూచించారు. లేదంటే ప్రభుత్వం ఇస్తామన్న మూడు ఉచిత సిలిండర్లలో ఒకటి కోల్పోతారన్నారు. ఏప్రిల్ నుంచి రెండో సిలిండర్ బుకింగ్ ప్రారంభమవుతుందని చెప్పారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న ఈ పథకం కింద గురువారం వరకు 3,50,925 మంది లబ్ధిదారులు సిలిండర్లను బుక్ చేసుకోగా, 3,48,171 మంది బ్యాంకు ఖాతాల్లో 48 గంటల్లోనే సబ్సిడీ డబ్బులు జమయ్యాయని తెలిపారు. 2,754 మందికి రేపోమాపో సబ్సిడీ మొత్తం జమవుతుందని చెప్పారు.

పూర్తికాని ఇళ్లకు ప్రభుత్వ సాయం

రేపటినుంచి లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాలనలో పూర్తికాని ఇళ్లకు ప్రభుత్వం సాయం చేయడానికి ముందుకు వచ్చిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో హౌసింగ్ పురోగతిపై డీఈ, ఈఈ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఏఈలతో సమీక్షించారు. ఇదివరకే ఇళ్ల నిర్మాణాలు చేపట్టి.. అర్థంతరంగా ఆగినవాటిని పూర్తి చేయడానికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందన్నారు. 17,898 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అదనపు సాయం చేయనుందని చెప్పారు. ఇందుకోసం శనివారం నుంచి ఈనెల 23వ తేదీ వరకు లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్మాణాలు వందశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

తెప్పపై ఆశీనులై..

ఏడుమార్లు పుష్కరిణి చుట్టిన ఏడుకొండల స్వామి



తిరుమలలో ఐదురోజుల పాటు జరిగిన వార్షిక తెప్పోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరిరోజు శ్రీదేవి, భూదేవి సమేతంగా ఏడుకొండల స్వామి పుష్కరిణిలో తెప్పపై ఆశీనులై ఏడుమార్లు విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం పుష్కరిణిలో అప్పటికే సిద్ధంగా ఉంచిన తెప్పలో కొలువుదీర్చారు. విశేషంగా అలంకరించిన తెప్పపై ఉత్సమూర్తులను ఏడుమార్లు తిప్పారు. చల్లని వాతావరణంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, అన్నమయ్య కీర్తనల నడుమ తెప్పోత్సవం వైభవంగా జరిగింది. చివరిరోజు కావడంతో పాటు శుక్రవారం పౌర్ణమి గరుడసేవ, రామకృష్ణతీర్థ ముక్కోటి కూడా ఉండటంతో భక్తులు భారీ సంఖ్యలో తెప్పోత్సవంలో పాల్గొన్నారు. దీంతో స్వామి పుష్కరిణి చివరిరోజు భక్తులతో కళకళలాడింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు

● పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్.వి. రమణారెడ్డి

ఫటా ఫట్



పలమనేరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో వేసవి ప్రారంభం కావడంతో తాగునీటి సమస్యకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని.. ఇందుకోసం కావాల్సిన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపామని ఎన్.వి. రమణారెడ్డి తెలిపారు. పలమనేరులో జరుగుతున్న అభివృద్ధి పనులకు తీసుకుంటున్న చర్యలపై 'ఆంధ్రజ్యోతి' చేసిన ముఖాముఖిలో క్లుప్తంగా...!

? తాగునీటి సరఫరాకు ప్రత్యేక కృషి

! పలమనేరులో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన రిజర్వాయర్ ఏడాది కిందటే ఎండిపోయింది. పలమనేరులో 58 వేల జనాభా ఉండగా.. వీరి కోసం 4.35 ఎంఎల్‌టీల నీరు అవసరం ఉంటుంది. నేడు 3.11 ఎం.ఎల్.టీల నీటిని సరఫరా చేస్తున్నాం. వేసవిని దృష్టిలో పెట్టుకొని అదనపు బోర్లు వేయడంతో పాటు ట్యాంకర్లతో సరఫరా చేసేందుకు రూ.91 లక్షల వరకు అవసరముంది. ఇందుకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. పలమనేరులో తాగునీటి కోసం శాశ్వత పరిష్కారానికి ఇప్పటికే నిర్మించిన రిజర్వాయర్ తాగునీటి అవసరాలు తీర్చలేకపోతోంది. ఇందుకు అనుబంధంగా గంగన్నశిరస్సు జలపాతం వద్ద మరో రిజర్వాయర్ నిర్మించి అక్కడి నుంచి ప్రస్తుత రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ చేసేందుకు ప్రభుత్వానికి డీపీఆర్ పంపాం. ఇందుకోసం ఇప్పటికే ఎమ్మెల్యే అమరనాథరెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లాం.

? పారిశుధ్యంపై నిరంతర పర్యవేక్షణ

! పలమనేరులో పారిశుధ్యంపై నిరంతరం పర్యవేక్షణ ఉంటోంది. 41 తోపుడు బండ్లు ఏర్పాటు చేశాం. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి కంపోస్టు యార్డుకు తరలిస్తున్నాం. రోజూ మురుగునీటి కాలువల్లో పూడిక తీత పనులు చేయిస్తున్నాం. వార్డుల్లోనూ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. మున్సిపాలిటీలోని ప్రజలు సహకరించాలి.

? పన్నుల వసూళ్లలో పలమనేరుకు ప్రథమ స్థానం

! పలమనేరు పన్నుల వసూళ్లలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఇప్పటి వరకు 67.70 శాతం పన్నులు వసూలు చేశాం. ఈనెలాఖరు లోపు 90 శాతం పైగా పన్నులు వసూలు చేసేందుకు సచివాలయ సిబ్బందికి రోజువారి లక్ష్యాలను పెట్టాం. పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం. టార్గెట్‌ను సాధిస్తాం.

? ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన

! పలమనేరులో ప్లాస్టిక్ వినియోగం నియంత్రించేందుకు చర్యలు ప్రారంభించాం. ఇప్పటికే పలమనేరులో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న దుకాణాలు, ప్లాస్టిక్ వినియోగిస్తున్న హోటళ్లు, బేకరీలు, కూరగాయలు, పండ్ల వ్యాపారులపై దాడులు నిర్వహించి జరిమానాలు వసూలు చేస్తున్నాం. పలమనేరు మున్సిపాలిటీలో సిబ్బంది కొరత లేదు. మున్సిపాలిటీలో ముగ్గురు సిబ్బంది మరణించారు. వారి స్థానంలో ముగ్గురితో పాటు మరో ఐదు మందిని ఆప్కాస్ నుంచి నియమించడం జరిగింది.

? దోమల నివారణకు చర్యలు

! మున్సిపాలిటీలో దోమల నివారణకు సాయంత్రం సమయంలో అన్ని వార్డుల్లోని ప్రధాన వీధుల్లో ఫాగింగ్ చేయిస్తున్నాం. మురుగునీటి కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికలు తొలగిస్తున్నాం. మురుగునీటి నిల్వలు లేకుండా సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

ప్రభుత్వ ఖాజీగా ముఫ్తీ షేక్ అబ్దుస్ సుబాహన్ నియామకం



నియామక పత్రాన్ని అందిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

చౌడేపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మండల ఖాజీగా ముఫ్తీ షేక్ అబ్దుస్ సుబాహన్‌ను నియమించినట్లు పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన దుర్గసముద్రం పంచాయతీ దాదేపల్లెకు చెందిన టీడీపీ నాయకులు ముఫ్తీ షేక్ అబ్దుస్ సుబాహన్‌కు నియామక పత్రాన్ని మండల మైనార్టీ నాయకులు సమక్షంలో చల్లా అందించారు. ఈ సందర్భంగా ఖాజీ మాట్లాడుతూ మైనారిటీల అభివృద్ధికి, టీడీపీ పటిష్ఠతకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మైనారిటీ మండలాధ్యక్షులు మహ్మద్ గని, నాయకులు అమీద్‌ఖాన్, షాజాన్ బాషా, రహీమ్‌ఖాన్, షావలి, పండు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శివ

పుంగనూరు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ సంబంధిత వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లయన్స్‌క్లబ్ జిల్లా ప్రాజెక్టు చైర్మన్ డాక్టర్ శివ అన్నారు. గురువారం మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ రాంపల్లెలోని డయాలసిస్ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రజలకు కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పించారు. స్థానిక ఏరియా ప్రభుత్వాస్పత్రి మెడికల్ ఆఫీసర్ మధుసూదనాచారి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడంతో పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అపోలో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ తేజస్విని, సీడీపీవో రాజేశ్వరి, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు త్రిమూర్తిరెడ్డి, వరదారెడ్డి, ముత్యాలు, అమరావతి సురేశ్, అహ్మద్, బాలసుబ్రహ్మణ్యం, కేశవరెడ్డి, శ్రీకాంత్, గంగులచారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల నెల 17 నుంచి మే 2వ తేదీ లోపు ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమా కోరారు. గురువారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ కులాలకు చెందిన విద్యార్థులు ఫీజు రూ. 200 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ. 150 ఫీజు చెల్లించాలన్నారు. విద్యార్థుల మెరిట్‌తో రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీట్లు కేటాయించనున్నట్లు ఆమె తెలిపారు.

18న పలమనేరులో ఉద్యోగమేళా

పలమనేరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 18న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు తెలిపారు. మూడు కంపెనీలకు చెందిన ప్రతినిధులు మేళాలో పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ



విద్యాసామగ్రి అందుకున్న విద్యార్థులతో యువభారత్ అసోసియేషన్ సభ్యులు

బైరెడ్డిపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర్థం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం యువభారత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని వితరణగా అందజేశారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో యువభారత్ అసోసియేషన్ నిర్వాహకులు వేకాంత్, గణేష్, ఎస్ఎంసీ చైర్మన్ మోహన్, నాయకులు గోవిందస్వామి, రమేష్, శ్రీనివాసమూర్తి, విశ్వనాథ్, రాజు, శ్రీనివాసన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

పుంగనూరు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా పేదలకు ఫలాహ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్థానిక కొత్తయిండ్లు ఫలాహ పాఠశాల ఆవరణలో దాదాపు 100 మందికి రెండువేలు విలువైన సరకులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా రంజాన్ పండుగకు పేదలకు వంట సామాగ్రి, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయ సహకారాలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి అబ్దుల్‌అలీమ్, హాఫీజ్‌ఖాన్, ఇంతియాజ్, ఉస్మాన్‌ఖాన్, రియాజ్, వసివుల్లా, మహ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గరుడవాహనంపై లక్ష్మీనరసింహుడి విహారం



సోమల : పార్వేట మండపంలో పూజలందుకుంటున్న శ్రీవారు



దేవళంపేట పురవీధుల్లో విహరిస్తున్న లక్ష్మీనరసింహస్వామి

కల్లూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. ఆలయంలో ఉదయం అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

అశ్వ వాహనంపై శ్రీవారి విహారం

సోమల: సోమల మండలం ఆవులపల్లెలో కొలువుదీరిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిని అశ్వ వాహనంపై అధిష్ఠింపజేసి పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఉదయం ఆలయంలో మూల విరాట్‌కు విశేష అలంకరణలు చేసి అభిషేక పూజలు చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను గోవింద నామస్మరణలతో ఊరేగిస్తూ పత్రపల్లె సమీపంలోని పార్వేట మండపం వద్దకు చేరుకుని అర్చకులు పార్వేట ఉత్సవం నిర్వహించారు. పెద్దఉప్పరపల్లె, పేటూరు, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె పంచాయతీల్లోని కమ్మనాయుళ్ల కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

మార్గసాహేశ్వరస్వామి కల్యాణోత్సవం



బైరెడ్డిపల్లె: నెల్లిపట్ల గ్రామంలో వెలసిన మార్గసాహేశ్వర స్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, మాజీ జడ్పీటీసీ రాధమ్మ, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వెంకటరమణస్వామికి..



పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కల్యాణ వెంకట రమణ స్వామి గురువారం ఘనంగా కల్యాణోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుపతి తిరుమల దేవస్థానం ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా స్వామి వారికి కల్యాణం చేశారు. గజవాహనంపై స్వామి వారు పురవీధుల్లో ఊరేగారు.

వైభవంగా నలగుండ్రాయస్వామి గరుడోత్సవం

బైరెడ్డిపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపనత్తం గ్రామంలో కొలువైన నలగుండ్రాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గరుడోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అలివేలుమంగ, పద్మావతీ సమేత నలగుండ్రాయ స్వామి ఉత్సవమూర్తులకు అర్చకులు రామకృష్ణాచార్యులు విశేష అలంకరణ లు చేశారు. అనంతరం గరుడవాహనంపై కొలువుదీర్చి మేళతాళాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని కర్పూర హారతులిచ్చారు. ఆలయ, దర్మకర్త మురళీస్వామి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



'ఉపాధి'లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

● డ్వామా పీడీ రవికుమార్



ప్రజావేదికలో పాల్గొన్న డ్వామా పీడీ రవికుమార్ తదితరులు

రామకుప్పం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అవకతవలకు తావు లేకుండా పనులు చేపట్టాలని.. లేకుంటే చర్యలు కఠినంగా ఉంటాయని డ్వామా పీడీ రవికుమార్ తెలిపారు. గురువారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొన్ని చోట్ల పనుల విషయంలో అలసత్వం వహించిన సిబ్బందిని ఆయన మందలించారు. ప్రభుత్వ నిధులతో చేపట్టే ప్రతి పని ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని కోరారు. ప్రజావేదిక అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2023-2024 సంవత్సరంలో మండలంలో రూ.17.45కోట్లు నిధులను ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. పనుల్లో కొలతల తేడా ఉండటంతో రూ.2.59 లక్షలు రికవరీకి సిబ్బందిని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి శివయ్య, ఏపీడీ వెంకటరత్నం, ఎస్ఆర్పీ, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు



ఉద్యోగులకు బహుమతులు అందిస్తున్న డిపో మేనేజర్ సుధాకరయ్య

పుంగనూరు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి ఆదాయాన్ని పెంచుతున్న ఆర్టీసీ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు పుంగనూరు ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో డీజిల్ ఆదా చేయడం, కలెక్షన్ పెంచడం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. డ్రైవర్ అన్వర్, చక్రపాణి, కండక్టర్ దామోదర్‌రెడ్డిలను అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు సంధ్య, మురళీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ సమావేశం

పలమనేరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపల్ సాధారణ సమావేశం ఈనెల 15న శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన జరిగే సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా: చల్లా



చల్లా రామచంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు, నాయకులు

సోమల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని.. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి సోమల మండలంలోని మల్లేశ్వరపురం, ఆవుల పల్లెలో ఆయన పర్యటించారు. ఆవులపల్లె ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, ఉమాపతి నాయుడు, వేణుగోపాల్ నాయుడు, బాలాజీ నాయుడు, హరి ప్రసాద్, సతీశ్, శివశంకర్, శ్రీనివాసులు నాయుడు, భానుప్రకాశ్, జయసింహ, బాబు రావ్, మహేంద్ర బాబు, రత్నయ్య, రెడ్డెప్ప నాయుడు, బాలకృష్ణమ నాయుడు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

చౌడేపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని దిగువపల్లె పంచాయతీ కొలింపల్లెకు చెందిన మురళీ అదే గ్రామంలో అతడి దుకాణం వెనుక అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేశారు. అతడి నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆలయాల్లో హుండీల లెక్కింపు



సత్యగంగమ్మ ఆలయంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

పలమనేరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని సత్యగంగమ్మ గుడి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లోని హుండీలను గురువారం ఆలయాల కార్యనిర్వహణ అధికారి కమలాకర్ సమక్షంలో లెక్కించారు. సత్యగంగమ్మ గుడి హుండీ ఆదాయం రూ. 1,62,504, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం హుండీ ఆదాయం రూ.2,61,944 సమకూరింది. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యకుమార్, సిబ్బంది విజయ భాస్కర్‌రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

స్కిల్ యాప్‌తో రైతులకు ప్రయోజనాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో జ్యోతి

చౌడేపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్కిల్ యాప్‌తో రైతులకు పలు ప్రయాజనాలు ఉంటాయని ఏవో జ్యోతి పేర్కొన్నారు. గురువారం ఆమె స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులకు, రైతు సేవా కేంద్ర సిబ్బందికి అవగాహన కల్పించారు. రైతులు డిజిటల్ పద్ధతిలో యాప్ తో వాతావరణ పరిస్థితితులు, పంటల ధరలు తదితర అంశాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి శివప్రసాద్, రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పిఠాపురానికి పుంగనూరు జనసేన నాయకులు

పుంగనూరు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి పుంగనూరు నుంచి జనసేన పార్టీ నాయకులు భారీగా తరలివెళ్లారు. గురువారం పుంగనూరు అర్బన్, మండల పరిధిలోని జనసేన నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. పార్టీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, విరూపాక్షి, శివకుమార్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, శ్రీరాములు, నాయుడు, శ్రీరాములు పాల్గొన్నారు.

తీర్థంలో రక్షిత బోరు మంజూరు

బైరెడ్డిపల్లె, మార్చి 13 (ఆంధజ్యోతి): మండలంలోని తీర్థం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చొరవతో నూతనంగా రక్షిత బోరు మంజూరు చేశారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, అధికారులకు తీర్థం టీడీపీ నాయకులు గోవిందస్వామి, రమేష్, శ్రీనివాసమూర్తి, విశ్వనాథ్, కృష్ణప్పగౌడు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. బోరులో నీరు పుష్కలంగా పడటంతో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలని వినతి



ఎంపీడీవో లీలామాధవికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పుంగనూరు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తమకు పని ఒత్తిడి తగ్గించాలని గురువారం ఎంపీడీవో లీలామాధవికి గురువారం పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందించారు. పంచాయతీ పరిధిలో 13 సర్వేలు చేయాల్సి ఉంటుందని వాపోయారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, బసవరాజ, నరసింహులు, వసుందర పాల్గొన్నారు.

నాగిరెడ్డిపల్లెలో ఘనంగా గంగ జాతర

చౌడేపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లెలో గంగ జాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి నుంచి ఉదయం వరకు గ్రామ పొలిమేరల్లోని గ్రామ దేవతలకు మహిళలు దివ్వెలు, దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నడివీధిలో వెలసిన గంగమ్మకు ప్రత్యేక పూజలు చేపట్టారు.

నిరభ్యంతర భూముల్లో స్థలాల క్రమబద్ధీకరణ

కుప్పం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అభ్యంతరాలు లేని పోరంబోకు భూముల్లో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్న వారు ఆ స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలని కుప్పం ఆర్డీవో శ్రీనివాసరాజు గురువారం ఒక ప్రకటనలో కోరారు. దీనికి సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన తెలిపారు. 2019 అక్టోబరు 15 నాటికి నిర్మించుకున్న అన్ని ఇళ్లకు ఇది వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం కింద లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని తెలిపారు.

సీఎంను కలిసిన శాంతారామ్



సీఎం చంద్రబాబుకు శ్రీవారి ప్రసాదాలు అందజేస్తున్న శాంతారామ్

కుప్పం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారామ్ గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబును కలిశారు. తన జన్మదినం సందర్భంగా ఆయన సీఎంకు శ్రీవారి ప్రసాదాలను అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలుకు నిర్ణయం తీసుకోవడంపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

పెరిగిన వారపుసంత వేలం రాబడి

రొంపిచెర్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మేజర్ పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, పీఆర్ఈవోఆర్డీ సత్యంరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వారపు సంత వేలంలో రూ.11 వేలు అధిక రాబడులు వచ్చాయి. వారపుసంత రూ.6,34,000, దినసరి మార్కెట్‌లు రూ.1,58,000లకు టి.ఎస్.ఇంతియాజ్‌బేగం, బస్టాండు రూ.1,50,000 లకు షకీలా కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మేరకు గేట్ వసూలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వార్డుమెంబర్లు నాగరాజ, లక్ష్మయ్య, శ్రీపతి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'యువత పోరు' జగన్ ఇంటిముందు చేయాలి: టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చిత్తూరు సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ ఇంటిముందు 'యువత పోరు' కార్యక్రమం చేయాలని వైసీపీ శ్రేణులకు టీడీపీ నాయకులు సూచించారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో పలువురు నాయకులు మీడియాతో మాట్లాడారు. జగన్ పెట్టి వెళ్లిన ఫీజు బకాయిలను చెల్లించాలని వైసీపీ శ్రేణులు ఇప్పుడు నిరసనలు చేపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మొదట ఫీజు పోరు అన్నారు.. స్పందన రాకపోవడంతో యువత పోరు పేరుతో విద్యార్థులు రాకపోయినా నిరసన కార్యక్రమాలు చేపట్టడం సిగ్గుచేటన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఒక్క ఏడాది కూడా జగన్ పట్టించుకోలేదని మండిపడ్డారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు గుర్తుకురాని ఫీజు రీయింబర్స్‌మెంటు విషయం ఇప్పుడు గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు. 2014-19 టీడీపీ పాలనలో ఏటా 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తే, జగన్ రెడ్డి పాలనలో కేవలం 9 లక్షల మంది విద్యార్థులకు.. అదీ విడతలవారీగా ఇచ్చి దాదాపు 7 లక్షల మందిని నట్టేట ముంచారని ఆరోపించారు. 2024 జనవరిలోనూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను జగన్ ఎగ్గొడితే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆ బకాయిలను విడుదలచేసి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చేశారని గుర్తుచేశారు. వైసీపీ చేసిన మోసాలను, దౌర్జన్యాలను, అన్యాయాలను ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని చెప్పారు. సమావేశంలో చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, రాష్ట్ర అధికార ప్రతినిధులు సురేంద్రకుమార్, సప్తగిరి ప్రసాద్, నేతలు మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, త్రిమూర్తి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోవద్దు

ప్రజలకు ఎస్పీ సూచన

చిత్తూరు అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోవద్దని ప్రజలకు ఎస్పీ మణికంఠ సూచించారు. అజ్ఞాత వ్యక్తుల నుంచి వచ్చే సంక్షిప్త సమాచారం, మెయిల్స్‌లోని లింకులను ఓపెన్ చేయొద్దన్నారు. ఈ విషయంలో పోలీసు సిబ్బంది కూడా ప్రజల్లో చైతన్యం తేవాలని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, మర్డర్, డెకాయిట్, రాబరీ, ప్రాపర్టీ, వాహనాల దొంగతనం కేసులు, నేరస్థుల అరెస్టులపై ఆరా తీశారు. అసాంఘిక కార్యకలాపాల అణచివేతకు డ్రోన్ల సాయంతో నిఘా పెంచాలన్నారు. హోంమంత్రి ఆదేశాల మేరకు జిల్లా అంతటా శక్తి టీమ్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. శక్తి యాప్‌పై వివరాలను తెలియజేశారు. అనంతరం గత నెలలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో ప్రతిభ చూపిన వన్‌టౌన్ సీఐ జయరామయ్య, పుంగనూరు సీఐ శ్రీనివాసులు, కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లుకు ప్రశంసాపత్రాలను అందించారు. ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


శక్తి యాప్ గురించి తెలియజేస్తున్న ఎస్పీ మణికంఠ

చట్టసభల్లో సముచిత స్థానం కల్పించండి

వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి

బంగారుపాళ్యం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో తమకు సముచిత స్థానం కల్పించాలని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి కోరారు. గురువారం బంగారుపాళ్యం మండలంలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీవల్లే వడ్డెర కులస్తులు అభివృద్ధి చెందారన్నారు. 2014-19లో అధికారంలో ఉన్న టీడీపీ తమకోసం వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రూ.132 కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. వైసీపీ పాలనలో తమ కులస్తులు పూర్తిగా వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల క్వారీలను తమకు లీజుపై కేటాయించాలని, అన్ని కాంట్రాక్టు పనులను ఈఎండీ లేకుండా ఇవ్వాలని, ప్రమాద బీమా రూ.25 లక్షలు కావాలని డిమాండ్ చేశారు. కాణిపాక దేవస్థాన పాలకమండలిలోనూ అవకాశం ఇవ్వాలని, తమను ఎస్టీల్లో చేర్చాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు రవీంద్రరాజు, నాయకులు అశోక్, మురగయ్య, ఆనంద్, సురేష్, ఎస్‌పీఎస్ శివ తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న మురళి

ఒంటరి వృద్ధభక్తులే టార్గెట్

తిరుమలలో మత్తు మందిచ్చి దోచుకుంటున్న ఇద్దరి అరెస్ట్

తిరుమల, మార్చి13(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వచ్చే వృద్ధ భక్తులను టార్గెట్ చేస్తూ.. మత్తు మందు ఇచ్చి దోచుకుంటున్న ఇద్దరిని తిరుమల పోలీసులు అరెస్ట్ చేశారు. టూటౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం.. వివరాల మేరకు.. ఈ ఏడాది జనవరి 5వ తేదీన ఓ భక్తురాలు తన సొత్తును ఎవరు దోచుకెళ్లారంటూ తిరుమల టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. శ్రీవారి ఆలయ తూర్పుమాడవీధిలోని గ్యాలరీ కూర్చుని ఉన్న తనకు దర్శనం చేయిస్తామని నమ్మించి మత్తు మాత్రలు ఇచ్చి తాళిబొట్టు చైన్, చెవి దిద్దులు తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా పోలీసులు విచారణ మొదలుపెట్టారు. కొందరు అనుమానితుల వీడియోలు, ఫొటోలతో తమిళనాడులోని ప్రధాన నగరాల్లో గాలించారు. పోలీస్ స్టేషన్లు, క్రైం బ్యూరోలను సందర్శించి ఫొటోలు, వీడియోలతో ఆరా తీయగా, భక్తురాలిని దోచుకున్నవారు తమిళనాడులోని విల్లుపురానికి చెందిన విజయ్ కుమార్, అతడి పిన్ని శారదగా తేలింది. ఆలయాలకు వెళ్లే ఒంటరి వృద్ధ భక్తులను టార్గెట్ చేసుకుని వారికి మాయమాటలు చెప్పి దగ్గరై ఆ తర్వాత ఆహారంలో నిద్ర మాత్రలు ఇస్తారు. భక్తులు మత్తులోకి వెళ్లిన తర్వాత వారి శరీరంపై ఉండే బంగారు వస్తువులను దోచుకెళుతున్నట్టు తేలింది. వీరిపై ఇప్పటికే తమిళనాడులో చాలా కేసులు ఉండటంతో పాటు జైలు శిక్షలూ అనుభవించినట్టు తిరుమల పోలీసుల విచారణలో తేలింది. ఎప్పటికప్పుడు పేర్లు, చిరునామాలు, ఫోన్ నెంబర్లు మారుస్తూ ఇతర నేరాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. తమిళనాడులోని మూడుజిల్లాల పోలీసులు వీరికోసం గాలిస్తున్న క్రమంలో ప్రత్యేక నిఘాతో తిరుమల పోలీసులు కాంచీపురంలో విజయకుమార్, శారదను గురువారం పట్టుకుని అరెస్ట్ చేశారు. వారి నుంచి 21 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.45 వేల నగదు, 3 సెల్‌ఫోన్లు, 6 మత్తు మాత్రలు, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు.

పంచాయతీలకు పన్ను పోటు

● నెలాఖరులోగా రూ.6.72 కోట్ల వసూలు సాధ్యమా...?



చిత్తూరు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వ్యవహారం పరిష్కారం లేని సమస్యగానే మిగిలింది. కొన్ని చోట్ల అసాధారణంగా పెంచుకుంటూ పోవడం, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వసూళ్లపై అంతగా శ్రద్ధ పెట్టక పోవడంతో బకాయిలు భారీగా పేరుకుపోయాయి. వీటిని రాబట్టడం ప్రస్తుత కార్యదర్శులకు తలనొప్పిగా మారింది. డీపీవో, పంచాయతీరాజ్ కమిషనర్ స్థాయిలో ఎప్పటికప్పుడు పన్నుల వసూళ్ల తీరుపై సమీక్షిస్తూ లక్ష్యాలు నిర్దేశిస్తుండడంతో పలుచోట్ల కొళాయిలకు కనెక్షన్లు కట్‌చేస్తామని బెదిరిస్తూ ఎంతోకొంత జమయ్యేలా చూస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా 697గ్రామ పంచాయతీలుండగా, నాలుగు రెవిన్యూ డివిజన్ల పరిధిలో పాత బకాయిలే రూ.17.44 కోట్ల దాకా వున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు రూ.10.72 కోట్లు వసూలు కావాల్సివుంది.పాత బకాయిలతో కలిపి ఇప్పటికి రూ.28.16 కోట్లలో రూ. 21.44 కోట్లు వసూలు చేయగలిగారు. ఈ నెలాఖరు లోగా మిగిలిన రూ.6.72 కోట్ల వసూలు సాధ్యమా అని అధికారులు మదనపడుతున్నారు. పన్నుల వసూళ్లలో 74.10 శాతంతో నగరి డివిజన్ ముందుండగా, 53.93 శాతం వసూళ్లతో పలమనేరు చివరి స్థానంలో నిలిచింది. 63.52 శాతం పన్నుల వసూళ్లతో చిత్తూరు, 60.65 శాతం పన్నుల వసూళ్లతో కుప్పం డివిజన్ వున్నాయి. ముందస్తుగానే డిమాండ్లు సిద్ధం చేసి జారీచేస్తున్నా... ప్రస్తుత పన్ను, గత బకాయిలు ఒకేసారి చెల్లించేందుకు గ్రామాల్లో ఎవరూ ముందుకు రావడంలేదు. దీంతో బిల్ కలెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు పదేపదే ఇండ్లకు వెళ్ళి బకాయిలు చెల్లించాలంటూ ప్రాధేయపడుతున్నారు.

● లక్ష్యానికి దూరంగా....

వాస్తవానికి ఫిబ్రవరి ముగింపు నాటికి 50 శాతం, మార్చి మొదటి పక్షానికి 75 శాతం, నెలాఖరుకు వందశాతం పన్నుల వసూలు చేయాలన్నది లక్ష్యం. కానీ అతి కొద్ది పంచాయతీలు మినహా 80శాతం పంచాయతీలు 50శాతం కూడా వసూలు చేయలేదు. నాన్ ట్యాక్సెస్ కలెక్షన్లలో డిమాండ్, కరెంట్ ట్యాక్స్ కలిపి రూ.5.46 కోట్లలో ఇప్పటివరకు రూ. 4.05 కోట్లు వసూలు చేశారు. మార్చి నెలాఖరులోగా రూ.1.41 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.

రెవిన్యూ డివిజన్	గ్రామ పంచాయతీలు	డిమాండ్ (రూ. కోట్లలో)	కరెంటు	చేయాల్సిన వసూళ్ల (రూ. కోట్లలో)	జరిగిన వసూళ్ల శాతం
చిత్తూరు	296	8.08	5.13	2.94	63.52
కుప్పం	093	1.35	0.82	0.53	60.65
నగరి	102	1.62	1.20	0.43	74.10
పలమనేరు	206	6.39	3.57	2.82	55.93
మొత్తం	697	17.44	10.72	6.72	61.50

పన్నుల వసూళ్లలో తృతీయ స్థానం



జిల్లాలో ఇంటి పన్నుల వసూళ్ళు ఉధృతంగా జరుగుతున్నాయి. కిందిస్థాయి సిబ్బందిని వసూళ్ళకే పరిమితం చేశాం. డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ల పర్యవేక్షణలో సిబ్బందికి లక్ష్యాలు నిర్దేశించి రోజువారీ ప్రగతిని సమీక్షిస్తున్నాం. ప్రస్తుతానికి రాష్ట్రస్థాయిలో ప్రకాశం, తూర్పు గోదావరి జిల్లాల తర్వాత చిత్తూరు జిల్లా పన్నుల వసూళ్ళలో తృతీయ స్థానంలో ఉంది. మార్చి నెలాఖరు లోగా రూ.6.72 కోట్లు వసూలు చేస్తామన్న నమ్మకముంది.

- సుధాకర రావు, డీపీవో, చిత్తూరు

సీడీసీఎంఎస్ ఆధ్వర్యంలో గ్యాస్ ఏజెన్సీ, రెండు పెట్రోల్ బంకులు

ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు ప్రతిపాదన : బిజినెస్ మేనేజర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (సీడీసీఎంఎస్) ఆధ్వర్యంలో గ్యాస్ ఏజెన్సీ, రెండు పెట్రోల్ బంకుల ఏర్పాటుకు స్థలం కేటాయించాలంటూ కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ప్రతిపాదన పంపామని బిజినెస్ మేనేజర్ వై.శ్రీధర్ నాయుడు తెలిపారు. గురువారం స్థానిక డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సీడీసీఎంఎస్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జేసీ విద్యాధరి హాజరయ్యారు. బిజినెస్ మేనేజర్ మాట్లాడుతూ.. సొసైటీ కార్యకలాపాలను, అజెండా వివరాలను సభ్యులకు వివరించారు. గత ఏడాది పీఎం జన ఔషధి పథకం కింద మెడికల్ షాపును సొసైటీ ప్రధాన కార్యాలయ ఆవరణంలో ప్రారంభించామన్నారు. రైతుల సౌకర్యార్థం ఎరువులు, క్రిమి సంహారక మందులు, విత్తనాల సరఫరా కోసం కుప్పం, పలమనేరు తదితర ప్రాంతాల్లో బ్రాంచ్‌లు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఏపీ సీడ్స్ ద్వారా మేలురకపు వరి విత్తనాలు (వడ్లు) కొనుగోలు చేసి, జిల్లాలో వివిధ సెంటర్ల ద్వారా విక్రయించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. 55 ఏళ్ల క్రితం ఏర్పాటై చిత్తూరు, తిరుపతిలో కొనసాగుతున్న చిత్తూరు జిల్లా కో-ఆపరేటివ్ ప్రింటింగ్ ప్రెస్‌కు శాశ్వత భవనం లేదని, దీని కోసం చిత్తూరులో ఎకరా స్థలం కేటాయించాలని అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి, చిత్తూరు డీఎల్సీవో వనజ కోరారు. అంతకుముందు ప్రింటింగ్ ప్రెస్ సీఈవో కె.మురళి అజెండాలోని అంశాలను సభ్యులకు వివరించారు. డీసీవో నాగవర్ధన, డీసీసీబీ సీఈవో శంకర్ బాబు, డీసీఏవో బ్రహ్మానంద రెడ్డి, సింగిల్ విండోల సీఈవోలు, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.



ముగిసిన 'విరించి'

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ వేదికగా నిర్వహించిన విరించి-2025 కార్యక్రమం గురువారం ముగిసింది. రెండు రోజుల పాటు సాగిన ఈ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 912 మంది విద్యార్థులు రికార్డు స్థాయిలో పాల్గొన్నారు. క్లూ ఛేజర్స్‌లో 509 మంది, మిస్ విరించిలో 40 మంది, ప్రావర్బ్స్, రిడిల్స్‌లో 115 మంది, నాట్యంలో 65 మందితో పాటు ఇతర పోటీల్లో విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

ఖాతాదారుల నగలు తనఖా పెట్టిన బ్యాంకు డిప్యూటీ మేనేజర్ అరెస్టు


వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న సీఐ మురళి

సత్యవేడు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నాగలాపురం యూనియన్ బ్యాంకులో ఖాతాదారుల నగలను కాజేసి రూ.2.35 కోట్లకు తనఖా పెట్టిన డిప్యూటీ మేనేజర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను గురువారం సత్యవేడులో సీఐ మురళి మీడియాకు వివరించారు. 'నాగలాపురంలోని యూనియన్ బ్యాంకులో 2024 మే నుంచి 2025 ఫిబ్రవరి 10వ తేదీ వరకు బంగారు నగలపై రుణాలు పొందిన 67 మంది ఖాతాదారులకు సంబంధించిన రెండున్నర కిలోల నగలను డిప్యూటీ మేనేజర్ ఆరవ సూర్యతేజ్ లాకర్ల నుంచి ఎత్తుకెళ్లాడు. ఇందులో 30 మంది ఖాతాదారుల నగలను కుదువ అంగళ్లు, ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల్లో తనఖా పెట్టి రూ.1.04 కోట్లు తీసుకున్నాడు. మరో 37 మంది ఖాతాదారుల నగలను అదే బ్యాంకు(నాగలాపురం యూనియన్ బ్యాంకు)లోనే 11 మంది బినామీ పేర్లపై రొటేషన్ పద్ధతిలో మార్చుకుంటూ కుదువ పెట్టి రూ.1.31 కోట్లు తీసుకున్నాడు. ఇలా కాజేసిన నగలను తనఖా పెట్టి రూ.2.35 కోట్లు కాజేశాడు. ఇటీవల బ్యాంకులో జరిగిన ఆడిట్‌లో ఈ ఘరానా మోసం వెలుగు చూసింది. విచారణ జరిపిన అధికారుల బృందం ఖాతాదారులు తమ అవసరాల నిమిత్తం బ్యాంకులో తనఖా పెట్టిన నగలను బ్యాంకు డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్ దొంగతనం చేసినట్లు నిర్ధారించారు. యూనియన్ బ్యాంకు తిరుపతి రీజియన్ డీజీఎం బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్‌తో పాటు విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న బ్యాంకు మేనేజరు తిరైవరాజ్‌పై నాగలాపురం పోలీస్‌స్టేషన్‌లో గత నెల 20న కేసు నమోదైంది' అని సీఐ వివరించారు. సత్యవేడు సీఐ ఆధ్వర్యంలో విచారణ చేపట్టిన పోలీసులు డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్‌ను నాగలాపురం హైవే సమీపంలోని ఆర్చి వద్ద అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. బ్యాంకు మేనేజర్ తిరైవరాజ్ పరారీలో ఉన్నారు. ఇతడి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు. సమావేశంలో నాగలాపురం ఎస్ఐ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, బ్యాంకులో ఘరానా మోసానికి పాల్పడిన సూర్యతేజ్ ఆ డబ్బులను ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆడి పోగొట్టుకున్నట్లు తెలిసింది. ఆయన నుంచి నగలను తాకట్టు పెట్టిన పలు రసీదులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

తిరుపతిలో ఇంటర్ మోడల్ బస్‌స్టేషన్ బేస్ మాస్టర్ ప్లాన్ సిద్ధం

కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరి

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇంటర్ మోడల్ బస్‌స్టేషన్ నిర్మాణం ప్రతిపాదనలు ప్రస్తుతం ఏ స్థితిలో ఉన్నాయంటూ పార్లమెంటు ప్రశ్నోత్తరాల సమయంలో ఎంపీ గురుమూర్తి ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరి వివరణ ఇచ్చారు. బేస్ మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని, ప్రాజెక్టు నమూనాను సంబంధిత వర్గాల సూచనలతో మెరుగుపరిచే పనులు జరుగుతున్నాయని తెలిపారు. డిజైన్ సిద్ధమైన వెంటనే పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ద్వారా నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో కలసి ప్రాజెక్టు అమలు చేయనుందని వివరించారు.

వెటర్నరీ విద్యార్థుల మానవహారం

తిరుపతి రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారమూ కొనసాగింది. ఇందులో భాగంగా విద్యార్థులు వర్సిటీ నుంచి ర్యాలీగా బయలుదేరి బాలాజీకాలనీ సర్కిల్‌కు చేరుకుని మానవహారం చేపట్టారు. స్టైఫండ్ పెంచాలని నినాదాలు చేశారు. వీరికి ఏఐఎస్ఎఫ్ నేతలు సంఘీభావం తెలిపి, మద్దతు ప్రకటించారు. అంతకుముందు ఎస్వీయూ ప్రధాన ద్వారం ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులతో కలసి నిరసన తెలిపారు. తిరిగి వర్సిటీకి చేరుకుని ప్రధాన గేటు ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో సమ్మెను కొనసాగించారు.



హరియాణా టూ తిరుపతి.. వయా ఢిల్లీ

● ఎన్నో ఏళ్లుగా మద్యం అక్రమ రవాణా.. విక్రయాలు ● రూ.1.28 లక్షల మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్టు ● మూలాలపై ఆరా తీస్తున్న ఎక్సైజ్ అధికారులు


ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న హరియాణా మద్యం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 13(ఆంధ్రజ్యోతి): హరియాణా నుంచి ఢిల్లీ మీదుగా గూడూరు, తిరుపతికి తీసుకొచ్చి కొన్నేళ్లుగా సాగిస్తున్న అమ్మకాల గుట్టు రట్టయింది. ఈ కేసులో హరియాణాకు చెందిన.. ప్రస్తుతం తిరుపతిలో ఉంటున్న ప్రధాన సూత్రధారి గజేంద్ర శర్మను, దీనికి ఆర్థిక సహకారం అందిస్తున్న సి.బాబును ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.28 లక్షల విలువ చేసే 109 హరియాణా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు విజయశేఖర్ గురువారం తిరుపతిలో మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. హరియాణాకు చెందిన గజేంద్రశర్మ తిరుపతి స్కావెంజర్స్ కాలనీలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని ఆయుర్వేద మందులు అమ్ముతున్నాడు. ఈ క్రమంలో హరియాణా నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ తీసుకొచ్చి అమ్మడంపై దృష్టి పెట్టాడు. ఎందుకంటే.. ఇక్కడికి, అక్కడికి బాటిల్‌పై దాదాపు రూ.700 వ్యత్యాసం ఉంది. దీంతో తొలి రోజుల్లో ప్రతి నెలా హరియాణా నుంచి మద్యం సీసాలను ట్రావెల్స్ బ్యాగులో పెట్టుకుని ఢిల్లీకి.. అక్కడ్నుంచి రైళ్లలో గూడూరుకు చేర్చేవాడు. అక్కడ ట్రావెల్స్, ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లతో పరిచయాలు పెంచుకుని వారి ద్వారా విక్రయించేవాడు. ఈ ఆదాయం రూ.లక్షల్లో ఉండటంతో కొంతమంది మధ్యవర్తులను నియమించుకుని వ్యాపారాన్ని విస్తరించాడు. అదే సమయంలో తిరుపతి నగరం తాతయ్యగుంటలో కూల్‌డ్రింక్ దుకాణం నిర్వహిస్తున్న సి.బాబుతో పరిచయం పెంచుకుని.. హరియాణా మద్యం అక్రమ విక్రయాలను తిరుపతిలోనూ మొదలు పెట్టాడు. ఇందులో మంచి లాభాలు రావడంతో బాబు కూడా అవసరమైన పెట్టుబడి పెట్టాడు. తన దుకాణంలో సిట్టింగ్ ఏర్పాటు చేసుకుని మద్యం విక్రయాలు చేస్తూ వచ్చాడు.

గుట్టు రట్టయిందిలా..

హరియాణా నుంచి తెచ్చిన మద్యాన్ని నాయుడుపేటలో విక్రయించడానికి ఓ మద్యం దుకాణం వద్దకు గజేంద్రశర్మ వెళ్లాడు. తన వద్ద హరియాణాకు చెందిన మిలటరీ మద్యం ఉందని కొనుగోలు చేస్తామంటే తీసుకొస్తానని దుకాణ సూపర్‌వైజర్‌తో చెప్పాడు. దీనిపై అనుమానం వచ్చిన అతడు.. నాయుడుపేట ఎక్సైజ్ సీఐ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డికి సమాచారం ఇచ్చారు. వెంటనే జిల్లా ఎక్సైజ్ అధికారులు వాసుదేవ చౌదరి, నరసనాయుడు, శ్యామ్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ స్వామినాథన్, అర్బన్ సీఐ రామచంద్ర, అధికారులు, సిబ్బంది రంగంలోకి దిగారు. తమకు హరియాణా మద్యం కావాలంటూ ఫోనులో గజేంద్రశర్మతో మాట్లాడారు. దీంతో గురువారం అతడు వివిధ బ్రాండ్లకు సంబంధించి 109 బాటిళ్ల హరియాణా మద్యం తీసుకురాగా అదుపులోకి తీసుకుని విచారించారు. తిరుపతికి చెందిన కూల్‌డ్రింక్ దుకాణం యజమాని బాబునూ అరెస్టు చేశారు. వారి నుంచి 12 ఖాళీ బాటిళ్లతో పాటు దాదాపు రూ.1,28,600 విలువ చేసే మద్యం సీజ్ చేశారు. ఈ కేసులో పాత్రధారి తిరుపతికి చెందిన కారు డ్రైవర్ చల్లా శ్రీనివాస రెడ్డి కోసం గాలిస్తున్నారు.

'వైసీపీ' కబ్జాదారుల నుంచి బడి స్థలాన్ని కాపాడండి

● కూటమి నాయకుల విజ్ఞప్తి



బడి స్థలంలో పెట్టిన కర్రలు

శ్రీరంగరాజపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పొదలపల్లె గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన స్థలాన్ని వైసీపీకి చెందిన కబ్జాదారుల నుంచి కాపాడాలని కూటమి నాయకులు శ్రీరాములు, గిరిప్రసాద్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ బడికి వెంకటాపురం గ్రామ రెవెన్యూ సర్వే నెంబరు 213/16లో 1.13 సెంట్ల స్థలం ఉంది. వైసీపీ హయాంలో గ్రామానికి చెందిన కొందరు వైసీపీ నాయకులు ఆ పాఠశాల స్థలాన్ని కబ్జా చేసి.. ఇల్లు నిర్మించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కబ్జాపై అధికార పార్టీ నాయకులు.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా ఎవ్వరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం ఈ స్థలాన్ని కొందరు వైసీపీ నాయకులు మళ్లీ ఆక్రమించడానికి యత్నం చేస్తున్నారని కూటమి నాయకులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. కర్రలను ఉంచారని, ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నారని.. ఇకనైనా ఉన్నతాధికారులు విచారించి బడి స్థలాన్ని కాపాడాలని విన్నవించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



బాధితుడికి చెక్కు అందజేస్తున్న చెన్నకేశవులు నాయుడు

చిత్తూరు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను చిత్తూరు ఎమ్మెల్యే తండ్రి చెన్నకేశవులు నాయుడు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో గురువారం చిత్తూరు రూరల్ మండలం బీఎన్‌ఆర్ పేటకు చెందిన చెన్నకేశవులు శెట్టికి రూ.38,914, నాయనిచెరువుకు చెందిన లోకేష్‌కు రూ.3.27 లక్షల చెక్కులను అందజేశారు. అలాగే గుడిపాల మండలం 189 కొత్తపల్లెకు చెందిన లలితకు రూ.1.12 లక్షలు, చిత్తూరుకు చెందిన చిన్నమ్మకు రూ.3.17 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, నాయకుడు గోవిందరాజులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలోనే కాన్పులు చేయండి: డీసీహెచ్‌ఎస్



డాక్టర్లతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ ప్రభావతి

పెనుమూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కి వచ్చే గర్భిణులకు ఇక్కడే కాన్పులు చేయాలని డీసీహెచ్‌ఎస్ ప్రభావతి ఆదేశించారు. గురువారం సీహెచ్‌సీని తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని చెప్పారు. ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రాత్రిపూట డ్యూటీ డాక్టర్ తప్పనిసరిగా ఉండాలన్నారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలగురునాథీశ్వర ఆలయంలో రుద్రహోమం

పాలసముద్రం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాచపాళ్యంలోని బాలగురునాథీశ్వర ఆలయంలో గురువారం పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. రుద్రహోమం నిర్వహించాక మూలవిరాట్‌కు, గ్రామ దేవతలకు అభిషేకాలను చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. స్థానికులతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కళాశాలలో ఆడిట్

నగరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అకడమిక్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ ఆడిట్ నిర్వహించారు. పీవీకేఎన్ కళాశాలకు చెందిన డాక్టర్ తిరుకుమారన్, ఎస్‌పీఎస్ కళాశాలకు చెందిన డాక్టర్ మల్లికా భ్రమరాంబ ఆడిట్‌లో భాగంగా రికార్డులను తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రాజు, ఐక్యూ కోఆర్డినేటర్ ఇందిరాప్రియదర్శిని పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లకు నివాళి



చిత్తూరు అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రామాయణాన్ని సంస్కృతం నుంచి సరళంగా తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ అని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. గురువారం కవయిత్రి మొల్ల జయంతి సందర్భంగా పాత గ్రీవెన్స్ హాలులో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలి

గుడిపాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఏపీఎం సుధారాణి అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో జరిగిన మండల సమాఖ్య సమావేశంలో వారు ప్రసంగించారు. సమాఖ్య అధ్యక్షురాలిగా కార్తీ, కార్యదర్శిగా సంధ్య, కోశాధికారిగా జమునలను ఎన్నుకున్నారు. టీడీపీ నాయకులు సాంబశివనాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజి నాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు, మధుసూదన్ నాయుడు, గోపి పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు

గుడిపాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలను ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ జయంతి అన్నారు. గురువారం రామభద్రాపురం పంచాయతీ సర్పంచ్ గోళ్ల హరిణి విజ్ఞప్తి మేరకు స్థలాన్ని పరిశీలించారు. సర్వేయర్ గోపీనాథ్, ఆర్‌ఐ రామసాయి. టీడీపీ నేత గోళ్ల హేమాద్రి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ కష్టం

యాదమరిలో బస్ షెల్టర్ లేక తీవ్ర ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



రోడ్డుపై నిలబడి, ఆటోల్లో కూర్చొని బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థులు

యాదమరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): యాదమరిలో బస్ షెల్టర్ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధిలోని గ్రామాల నుంచి రోజూ 500 మంది వరకు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు వెళుతుంటారు. ఎండలు పెరగడంతో మరిన్ని కష్టాలు తప్పడం లేదు. ఆర్టీసీ బస్సులు వచ్చేవరకు దుకాణాల వద్ద, రోడ్డుపై, ఆగి ఉన్న ఆటోల్లో కూర్చొని వేచి ఉండాల్సి వస్తోంది. ఇకనైనా అధికారులు చొరవ చూపి బస్ షెల్టర్ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు



పచ్చియమ్మన్ ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు

చిత్తూరు కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో వివిధ ఆలయాల్లో పౌర్ణమి పూజలను గురువారం భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మార్కెట్ చౌక్‌లో నవగ్రహ జ్యోతిర్లింగ సంతాన గణపతి ఈశ్వరాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు బలిజా సేవా సంఘం ప్రతినిధి వీకే విశ్వనాథ్ తదితరులు అన్నదానం చేశారు. 75 దొడ్డిపల్లె పచ్చియమ్మన్ ఆలయంలో భక్తులు కుంకుమార్చన చేశారు. శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, అగస్తీశ్వరాలయంలో రుద్రాభిషేకం, బోడికొండ మృత్యుంజయేశ్వర ఆలయంలో తులసి పూజలు జరిగాయి. గిరింపేట దుర్గాంబ ఆలయంలో మహా చండీ హోమం, పొన్నియమ్మ ఆలయంలో కుంకుమార్చన పూజలు నిర్వహించారు. వేలు, ఆరణి తులసీరాం, నళిని తిరుకుమరన్, మాధవన్, విజయ్, కృష్ణమూర్తి, మహేష్, కేదారేశ్వరన్, శివకుమార్ పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్య స్వామి గిరి ప్రదక్షిణలో భక్తులు

వైభవంగా గిరి ప్రదక్షిణ

పౌర్ణమి సందర్భంగా గిరింపేట వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గిరిప్రదక్షిణను వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో సుబ్బారెడ్డి, ఉత్సవ నిర్వాహకుడు పూల సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొన్నారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో పల్లకిసేవ జరిగింది.

శేషవాహనంపై శివపార్వతుల విహారం



పెనుమూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పులిగుండు శివాలయంలో పౌర్ణమి వేడుకలు గురువారం జరిగాయి. సాయంత్రం శివపార్వతులను శేష వాహనంపై అధిష్ఠింపజేసి.. కొత్తరోడ్డు, రాణా వేణుగోపాలపురం, సీఎస్ అగ్రహారం మీదుగా గిరిప్రదక్షిణగా ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు షణ్ముగరెడ్డి, గోవిందరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్'లో చిత్తూరుకు ఓటెయ్యండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా చేపడుతున్న ప్రజాభిప్రాయ సేకరణలో చిత్తూరుకు ఓటు వేసి మొదటి స్థానంలో నిలపాలని మేయర్ అముద పిలుపునిచ్చారు. గురువారం నగరపాలక కార్యాలయంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను కమిషనర్ నరసింహ ప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఆన్‌లైన్‌లో జరిగే ఓటింగ్‌లో నిరుద్యోగులు, యువత, ఉద్యోగులు, ప్రజలు విరివిగా నగరానికి అనుకూలంగా ఓటు వేయాలని వారు కోరారు. ఓటింగ్ కోసం ప్రతి వార్డు సచివాలయంలోనూ, నగరపాలక సామాజిక మాధ్యమాల్లోనూ క్యూఆర్ కోడ్ లింకు అందుబాటులో ఉందన్నారు.

లక్ష్మీ మహాగణపతికి ప్రత్యేక పూజలు



విజయపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మిట్టూరులోని లక్ష్మీ మహాగణపతి ఆలయంలో గురువారం వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. చందన అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ ఆవరణంలో అన్నదానం చేశారు. జగన్నాథపురంలో శ్రీరామనామ క్షేత్రంలో అభిషేకం చేసి.. నారాయణ సేవ పూజ నిర్వహించారు. ఆలయ పురోహితులు వందవాసి మహేష్‌శర్మ, రాంప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

నగరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి, నగరి వినియోగదారుల సంఘం ప్రధాన కార్యదర్శి జ్యోతినాయుడు కోరారు. నగరి మున్సిపాలిటీ, నగరి రూరల్, నిండ్ర, విజయపురం పిచ్చాటూరుల్లో హెచ్‌పీ గ్యాస్ విట్రాక్ట్ గ్రామీణ ఏజెన్సీ కింద 15,261 కనెక్షన్లు ఉన్నాయన్నారు. వీటిల్లో దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ పొందడానికి 9,613 కనెక్షన్లకు అర్హత ఉందన్నారు. 8510 కనెక్షన్లకు ఉచిత గ్యాస్ సిలిండర్ అందుతోందని చెప్పారు. మిగిలినవారు ఎంట్రీ చేసుకోని కారణంగా సిలిండర్ పొందలేక పోతున్నారన్నారు. వీరికి కూడా అందేలా చూడాలని నగరిలోని సంబంధిత గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు గురువారం సూచించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయంలో టెక్నాలజీని వినియోగించండి



రైతులకు సూచనలిస్తున్న లక్ష్మీప్రసన్న

ఐరాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో డిజిటల్ టెక్నాలజీని వినియోగించాలని జిల్లా వనరుల అధికారి లక్ష్మీప్రసన్న అన్నారు. గురువారం ఐరాలలోని ఆర్‌ఎస్‌కేలో స్కిల్ అప్ చిత్తూరు కార్యక్రమంలో భాగంగా రైతులకు డిజిటల్ టెక్నాలజీపై అవగాహన కల్పించారు. జిల్లా ఆర్‌ఎస్కే అధికారి మోహన్, ఏవో వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఈ-పంట'పై గ్రామసభ

గుడిపాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పానాటూరు రైతు సేవ కేంద్రంలో ఈ-పంట సామాజిక తనిఖీ గ్రామసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాధవి మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో సాగుచేసిన అన్ని పంటలను ఈ-పంట యాప్‌లో నమోదు చేయాలన్నారు. సర్పంచ్ పల్లవి, మధుసూదన్ రెడ్డి, విస్తరణాధికారి తులసీరామ్ రెడ్డి, వీఆర్వో జశ్వంత్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న కటారి హేమలత

చిత్తూరు సెంట్రల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద అన్నారు. గురువారం రాంనగర్ కాలనీలోని శ్రీచైతన్య స్కూల్లో జి.ఎన్.రావ్ మెమోరియల్ జోనల్ స్పోర్ట్స్ మీట్‌కు అతిథులుగా హాజరై, ప్రసంగించారు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ఎంఈవో సెల్వరాజ్, ఏజీఎం సురేష్, ఆర్‌ఐ చక్రధర్, హెచ్‌ఎంలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించండి: డీపీవో



పొలకల పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సుధాకర్‌రావు

ఐరాల, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డీపీవో సుధాకర్‌రావు ఆదేశించారు. గురువారం పొలకల పంచాయతీ కార్యాలయంలో తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కుసుమకుమారి, కార్యదర్శి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

యాదమరి: గ్రామాలను చెత్తరహితంగా తీర్చిదిద్దాలని డీపీవో అన్నారు. గురువారం వరదరాజులపల్లెలో ఆయన పర్యటించారు. గ్రామంలో చెత్తబుట్టలు పంపిణీ చేశారు. చెత్తనుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. డీపీఆర్సీ కోఆర్డినేటర్ షణ్ముగం, ఈవోపీఆర్డీ సుకుమార్ రెడ్డి, సర్పంచ్ పుష్పావతి, కార్యదర్శి దీపా, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో 'యూసీ మాస్' ప్రతిభ



చిత్తూరు సెంట్రల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అబాకస్ పోటీల్లో యూసీ మాస్‌కు చెందిన 150 మంది విద్యార్థులు ప్రతిభ చూపినట్లు డైరెక్టర్ భార్గవి, ఉమ తెలిపారు. షేక్ అయాత్ ఫైజాన్, వినీషారెడ్డిలు చాంపియన్ షిప్ కైవసం చేసుకోగా, విజువల్ పోటీల్లో భాగంగా 8 నిమిషాల్లో 200 లెక్కల పూర్తి చేసిన వారిలో 15 మంది మొదటి ర్యాంకు, 18 మంది రెండో ర్యాంకు, 25 మంది మూడో ర్యాంకు సాధించినట్లు వివరించారు.

వేము కళాశాలలో ఘనంగా ప్రజ్ఞా 2కే25



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

పూతలపట్టు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పి.కొత్తకోట సమీపాన ఉన్న వేము ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ప్రజ్ఞా 2కే25 కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా మీడెన్ టీఅండ్‌డీ ఇండియా లిమిటెడ్ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) రమేష్ చంద్ర సింగ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు, ప్రిన్సిపాల్ నవీన్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్‌కు అవసరమైన సలహాలు ఇచ్చారు. విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి.

ప్యాడ్లు, పెన్నుల వితరణ



చిత్తూరు కల్చరల్, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి): కట్టమంచి నగర పాలక ఉన్నత పాఠశాలలో చదువుచున్న పదో తరగతి విద్యార్థులకు సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు పరీక్షలకు అవసరమైన ప్యాడ్లు, పెన్నులను గురువారం వితరణ చేశారు. సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మధుసూదనం, నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

18 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. వాహనాల తనిఖీ చేపట్టగా, 18 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉమాదేవి ముందు గురువారం హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

సంక్షిప్తంగా..

వైభవంగా కల్యాణోత్సవం

పూతలపట్టు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎర్రచెరువుపల్లె సమీపాన ఉన్న ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి కల్యాణోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. అనంతరం శాంతిహోమం, భక్తులకు అన్నదానం చేశారు. కార్యనిర్వాహకులతోపాటు చుట్టుపక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చేపల పట్టుబడి హక్కుకు వేలం

వెదురుకుప్పం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కేఎంపురం గ్రామ పంచాయతీ పరిధిలోని రెడ్డి, చిన్నకమ్మచెరువులకు సంబంధించి చేపల పట్టుబడి హక్కు కోసం బహిరంగ వేలాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్నవారు ఆరోజున కేఎంపురం పంచాయతీ కార్యాలయం వద్దకు రావాలని మత్స్య అభివృద్ధి అధికారి ఆర్.రాంమోహన్ తెలిపారు.

విద్యాసామగ్రి వితరణ



చిత్తూరు అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థులకు గురువారం కరణం అభ్యుదయ ఫెడరేషన్ సేవాసంఘం ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని వితరణ చేశారు. సంఘ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు తాండవమూర్తి, జనరల్ సెక్రటరీ నిరంజన్‌బాబు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

చిత్తూరు కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కట్టమంచి షిరిడి సాయి బాబా ఆలయంలో 18 నుంచి 20వ తేదీవరకు నిర్వహించనున్న మహా కుంభాభిషేక వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్టీ సీకే లావణ్య, గోల్డ్ మల్లికార్జున, వెంకటేష్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

శ్రీరంగరాజపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పల్యేలుకాయలకోనలోని ఆత్మలింగేశ్వరస్వామికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఉభయదారులుగా సర్పంచ్‌హరిత, కుప్పయ్య వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త మోహన్ నాయుడు, మాధవ నాయుడు, దేవరాజులు నాయుడు, జనార్దన్, మణి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి



విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న టీచర్లు

వెదురుకుప్పం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి.. ఉన్నత స్థాయికి ఎదగాలని పచ్చికాపల్లం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సిద్ధయ్య ఆకాంక్షించారు. గురువారం పాఠశాల ఆవరణంలో వార్షికోత్సవం, టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలకు, మహిళలకు రక్షణ కల్పించాలి

జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి భారతి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి భారతి

గంగాధరనెల్లూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు, మహిళలకు రక్షణ కల్పించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.భారతి అన్నారు. వేపంజేరి గ్రామంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికలపై అఘాయిత్యాలను జరగకుండా సచివాలయాల పరిధిలోని మహిళా పోలీసులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఏమి చేస్తున్నారో, ఎవరితో మాట్లాడుతున్నారో గమనించాలన్నారు. ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, లీగల్ ఆఫీసర్ వెంకటేష్, సీఐ శ్రీనివాసరావు, తహసీల్దారు చంద్రశేఖర్, సీడీపీవో వినుతశ్రీ, ఏఎన్‌ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.